క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లచెరువు: మండల వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 3 వలంటీర్ పోస్టులకు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శకుంతల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లుగుండులో 1, ఉబిచర్లలో 2 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈనెల 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు ఖాతాల్లోకి వైఎస్సార్ ఆసరా సొమ్ము



మాట్లాడుతున్న ఏపీఎం రమణప్ప

ఓడీ చెరువు: మండలంలోని మహిళా సంఘాల సభ్యులకు శనివారం వైఎస్సార్ ఆసరా మూడవ విడత కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.5.26 కోట్లను ఖాతాల్లో జమ చేయనున్నట్లు ఐకేపీ ఏపీఎం రమణప్ప తెలిపారు. శుక్రవారం దిగువపల్లి గ్రామంలో మహిళ సంఘాల సభ్యురాళ్లు ఆసరా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. మండలంలోని 45 గ్రామాఖ్య సంఘాలు, 704 మహిళా సంఘాల్లోని 7,984 మంది మహిళల ఖాతాల్లో రూ.5,26,17,440 జమ అవుతాయన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు.

చిరుధాన్యాల ప్రయోజనాలపై వ్యాసరచన పోటీలు

ఓడీ చెరువు: మండలంలోని మిట్టపల్లి ఉన్నత పాఠశాలలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం చిరుధాన్యాలు, వాటి ప్రయోజనాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనుపరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూపరూప, ఏపీఎం రమనప్ప, సీసీ చంద్రారెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టిద్దాం

తనకల్లు: గ్రామాల్లో సేకరించిన చెత్త నుంచి సంపద సృష్టిద్దామని డీఎల్‌పీఓ అంజినప్ప అన్నారు. శుక్రవారం స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో అమడగూరు, మహమ్మదాబాద్, కురుమామిడి, కుమ్మరవాండ్లపల్లి, కాలసముద్రం గ్రామ పంచాయతీ సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా తనకల్లు మోడల్ గ్రామ పంచాయతీగా ఎంపికైందన్నారు. గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు సేకరించిన పొడి, తడి చెత్త నుంచి ఎరువులను తయారు చేయనున్నట్లు తెలిపారు. ఎరువులను రైతులకు విక్రయించి, పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పూల నరసింహులు, ఈఓఆర్డీ ఆనందయ్య, పలువురు సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రూ.5.86 లక్షల ఆదాయం



వారపు సంతకు బహిరంగ వేలం నిర్వహిస్తున్న దృశ్యం

ఓడీ చెరువు: స్థానిక గ్రామ సచివాలయంలో శుక్రవారం సర్పంచు గోవిందు అధ్యక్షతన మండల కేంద్రంలో ప్రతి బుధవారం నిర్వహించే వారపు సంతకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో వారపు సంతకు సంబంధించి తుమ్మల హిదాయతుల్లా అత్యధికంగా రూ.3,95,500 పాడి వారపు సంతను దక్కించుకున్నారు. అదేవిధంగా లోడింగ్ అండ్ అన్‌లోడింగ్‌కు సంబంధించి మండోజీ ఆరిఫ్‌ఖాన్ రూ.1,90,500లకు దక్కించుకున్నారు. వేలం ద్వారా రూ.5.86 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం లభించిందని ఈఓఆర్డీ రాజశేఖర్, గ్రామ కార్యదర్శులు ప్రకాష్, రామలింగా రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచు వెంకటరమణ, జానీబాషా,పవన్ కుమార్, రామిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

గురుకులం పిలుస్తోంది..

- 5వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- దరఖాస్తుకు తుది గడువు ఏప్రిల్ 4



బత్తలపల్లిలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల

బత్తలపల్లి: గురుకుల విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బత్తలపల్లి మండలంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకులంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ బాల, బాలికలకు ఆహ్వానం పలుకుతోంది. ఇక్కడ పాఠశాలల్లో పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు మంచి అధునాతన వసతులు, విశాలమైన మైదానం, గ్రంథాలయం, డిజిటల్ తరగతులు, నాణ్యమైన అధ్యాపకులు ఉన్నారు. 5వ తరగతిలో ప్రవేశం పొందితే పదవ తరగతి, ఇంటర్మీడియట్ వరకూ విద్యను అభ్యసించవచ్చు. ఏప్రిల్ 4వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

దరఖాస్తు చేయు విధానం ఇలా..

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలంటే ముందుగా బాల, బాలికల పేరు, పుట్టిన తేదీ, తండ్రి లేదా సంరక్షకుడి పేరు, మొబైల్ నంబర్ తదితర ప్రాథమిక వివరాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత ఒక నంబరు వస్తుంది. ఆ నంబరు పొందినంత మాత్రాన దరఖాస్తు చేసుకున్నట్లు కాదు. https://www.mjpapbcwreis.apcfss.in/ ఆ నంబరును నమోదు చేయాలి. పరీక్ష తేదీని పరీక్ష జరిగే వారం రోజుల ముందుగా ప్రకటిస్తారు.

ఆదాయ పరిమితి ఇలా..

గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందే విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకుల సంవత్సరం ఆదాయం రూ.లక్షకు మించి ఉండరాదు. బీసీ, ఈబీసీ, ఇతర విద్యార్థుల వయస్సు 9 నుంచి 11 ఏళ్ల మధ్య ఉండాలి. వీరంతా 01-09-2012 నుంచి 31-08-2014 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 9 నుంచి 13 ఏళ్లకు మించి ఉండరాదు. వీరంతా 01-09-2010 నుంచి 31-08-2014 మధ్య జన్మించి ఉండాలి. విద్యార్థులు సంబంధిత జిల్లాలో ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల్లో గత రెండు సంవత్సరాల నుంచి నిరంతరంగా చదువుతూ ఉండాలి.

చైర్మన్ ప్రోత్సాహంతోనే అభివృద్ధి..

బత్తలపల్లిలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కొడవండ్లపల్లి చంద్రశేఖర్ ప్రోత్సాహంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. పాఠశాలలో దాతల సహకారం, మనబడి నాడు–నేడు కింద అదనపు తరగతి గదులు, బాతురూంలు, మరుగుదొడ్లు నిర్మాణాలు వంటి చేపట్టి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నారు. మరికొందరు దాతలు ముందుకు వస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామన్నారు.

విద్యార్థులకు సకల సదుపాయాలు



గురుకుల పాఠశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉచిత వసతి, నాణ్యమైన బోధన, యోగా, క్రీడలు, వారానికి రెండు రోజులు చికెన్, ఆరు కోడి గుడ్లతో కూడిన నాణ్యమైన భోజనం అందించడం జరుగుతుంది. స్నాక్స్, పండ్లు, కాస్మోటిక్ చార్జీలు, డిజిటల్ బోధన, 4 జతల దుస్తులు, దుప్పటి, బూట్లు, టై, సాక్సులు తదితర సదుపాయాలు ఉంటాయి.

\- సత్యనారాయణ, ప్రిన్సిపాల్, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల

మొత్తం సీట్లు 80..

గురుకల పాఠశాలలో 5వ తరగతిలో 80 సీట్లు కేటాయించారు. బీసీ–ఏ 20, బీసీ–బీ 28, బీసీ–సీ 3, బీసీ–డీ 19, బీసీ–ఈ 4, ఎస్సీ–15, ఎస్టీ–6, అనాథలు–3, ఈబీసీ, ఇతర కులాల విద్యార్థులకు 2 శాతం చొప్పున సీట్లు కేటాయించారు. విద్యార్థులకు ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

పరీక్ష విధానం ఇదీ..

ప్రవేశ పరీక్ష మొత్తం 50 మార్కులకు ఉంటుంది. తెలుగు–10, ఇంగ్లిష్–10, గణితం–15, పరిసరాల విజ్ఞానం (సైన్సు, సాంఘిక శాస్త్రం)–15 మార్కులు కేటాయించారు. సిలబస్ 4వ తరగతి స్థాయిలో ఉంటుంది. ప్రశ్నలు బహుళైచ్ఛిక రూపంలో ఉంటాయి. పరీక్ష సమయం 2 గంటల పాటు ఉంటుంది. జవాబులను ఓఎంఆర్ షీటులో గుర్తించాలి. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్‌లో ఉంటుంది. విద్యార్థులకు సొంత జిల్లాలోనే పరీక్ష కేంద్రాన్ని కేటాయిస్తారు.

సంక్షేమ పథకాల అమలుపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ మమతాదేవి

ధర్మవరం రూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు, హక్కులు తదితర వాటిపై శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, ఎంపీడీఓ మమతాదేవి, డీటీ ఈశ్వరయ్య తదితరులు మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల అమలుపై వివరించారు. 60 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం పింఛన్లు అందిస్తోందన్నారు. అర్హత వుండి ఇంకా ఎవరికైనా ఫించన్ రాకపోతే వెంటనే వలంటీర్‌కు అర్హత పత్రాలను అందించి పింఛన్లు పొందాలని సూచించారు. అనంతరం వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు.

ఆర్థికసాయం అందజేత

ధర్మవరం అర్బన్: ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ఫెయిల్ కావడంతో పట్టణంలోని తారకరామాపురానికి చెందిన వైద్య విద్యార్థి నవీన్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని రిటైర్డ్ జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ నరసింహులు తెలిపారు. శుక్రవారం ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తనవంతు సాయంగా రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడవద్దని యువతకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజీ వ్యవస్థ మెరుగునకు చర్యలు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో అండర్ డ్రైనేజీ వ్యవస్థ మెరుగునకు చర్యలు తీసుకుంటున్నట్లు పబ్లిక్ హెల్త్ డీఈ గోపాల్ పాయుడు పేర్కొన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాలతో శుక్రవారం భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు మెరుగుపరిచేందుకు రూ.192 కోట్లతో డీపీఆర్ తయారు చేసేందుకు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు వార్డుల్లో ఎస్టీపీ, పంపింగ్ హౌస్‌లకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పుట్టపర్తి పట్టణ జనాభా పెరగడంతో గతంలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ సరిపడక పవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగునకు చర్యలు తీసుకున్నారన్నారు. 7 ఎస్టీపీలు, 7 పంపిగ్‌హౌస్‌లతో పాటు పాత కొత్త లైన్లు కలుపుతూ డీపీఆర్ తయారు చేసి అమృత్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అనుమతులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ కంపెనీ సిబ్బంది సుదర్శన్‌రెడ్డి, శ్రవన్‌కుమార్ కమీషనర్ వెంకటరామిరెడ్డి, ఏఈ స్వాతి, మండల సర్వేయర్ లక్ష్మి, వీఆర్‌ఓలు వెంకటలక్ష్మి, లలితమ్మ ,మనోహర్, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, సెడ్‌క్యాబ్ డెరెక్టర్ మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు సూర్యాగౌడ్, చెరువుభాస్కర్‌రెడ్డి, సాయిగీత, పవన్‌కుమార్, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, కేశప్ప, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ జయప్రదం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

కదిరి టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రెండవ కౌన్సిల్ మహాసభ ఈనెల 26వ తేదీన ఉదయం 10 గంటలకు అనంతపురంలోని రమణ–రమేష్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బాబా ఫకృద్దీన్ తెలిపారు. కదిరి ఆర్అండ్‌బీలో శుక్రవారం ఉద్యోగ సంఘం నాయకులు ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. జెడ్పీ ఆఫీస్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకూ జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.

‘క్షయ’పై అప్రమత్తంగా ఉండాలి



తనకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



ఎన్‌పీకుంట: క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ధర్మవరం అర్బన్: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మలత తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. క్షయ ఒక అంటు వ్యాధి అని, తగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, క్షయ క్రిములు గాలి ద్వారా వ్యాపిస్తాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఖరీదైన మందులను ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. క్షయ రోగులు 18 నెలల పాటు వైద్య చికిత్స పొందాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు శ్రేయస్ ఆసుపత్రి వైద్యులు కుమార్‌బాబు, షామీర్‌బాషా ఆరు నెలల పాటు ఉచితంగా పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఇందులేఖ, పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ శ్రావణి, యునాని డాక్టర్ ఖాదర్, టీబీ యూనిట్ సిబ్బంది కిష్టప్ప, రహమత్‌బాసా, చంద్రకళ, సావిత్రి పాల్గొన్నారు.

తనకల్లు: క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాకారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. అనంతరం సీహెచ్‌సీ నుంచి మెయిన్ రోడ్డు వరకూ విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో టీబీ మెడికల్ ఆఫీసర్ శివనారాయణ, ఎంపీహెచ్‌ఓ ఓబులేసు, ఎంపీహెచ్ఎస్ సూర్యనారాయణరెడ్డి, ఎస్టీఎల్ విజయ్‌కుమార్, ఎంపీహెచ్ఏ షబ్బీర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌పీకుంట: క్షయ వ్యాధి నిర్మూలనకు అధికారులతో పాటు ప్రజలు కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌వర్ధన్ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, బరువు తగ్గుతున్న వ్యాధిగ్రస్తులను గుర్తించి గళ్ల పరీక్ష చేయించాలని ఆశాకార్యకర్తలకు సూచించారు. క్షయ వ్యాధి సోకినట్లు తేలితే మందులు అందించి చికిత్స ప్రారంభించాలని తెలిపారు. సరైన సమయంలో వ్యాధిని గుర్తించి చికిత్స అందించినట్లయితే క్షయను నిర్మూలించవచ్చన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ శాంతమ్మ, ఎంపీహెచ్ఈఓలు లక్ష్మీనారాయణ, రాఘవేంద్ర, ఆరోగ్య కార్యకర్త రమేష్‌రెడ్డి, ఫార్మసిస్ట్ వరప్రసాద్, ఎల్‌టీ విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కదిరి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి టవర్‌క్లాక్, మున్సిపల్ కార్యాలయం వరకూ టీబీ మెడికల్ ఆఫీసర్ మున్వర్ బాషా ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ మైనుద్దీన్ ,ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ మాట్లాడారు. వ్యాధి నిర్ధారణ అయితే వారికి మందులు ఉచితంగా అందిస్తామన్నారు. క్షయ రోగులకు ప్రతి నెలా ప్రభుత్వం నుంచి రూ.500 అకౌంట్‌లోకి నగదు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ హేమంత్ కుమార్, ఎస్టీఎస్ శ్రీనివాసులు, నర్సింగ్ సూపరింటెండెంట్ వలసల దేవి పాల్గొన్నారు.

ముదిగుబ్బ: ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ముదిగుబ్బలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రాజేంద్ర ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీబీ లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సరస్వతమ్మ, పిహెచ్ఎన్ నాగరత్న, ఎంపీహెచ్ఈఓ రవీంద్రనాథ్, సూపర్‌వైజర్లు రసూల్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ధర్మవరం అర్బన్: పదో తరగతి విద్యార్థులకు ఆత్మీయ ట్రస్ట్ చేయూతనందించడం గర్వకారణమని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆత్మీయ ట్రస్ట్ ఆర్థిక సహాయ సహకారాలతో యూటీఎఫ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సుమారు 80 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ బీరే ఎర్రిస్వామి, హెచ్ఎం ఉమాపతి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ రమణ, యూటీఎఫ్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పదోతరగతి విద్యార్థులకు ధర్మవరానికి చెందిన ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష సామగ్రి అందించారు. 100 మంది విద్యార్థులకు పరీక్షలకు ఉపయోగించే ప్యాడ్, పెన్నులు అందజేశారు. ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు చేయూత అందిచాలనే లక్ష్యంతో సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవింద రెడ్డి, ఎంపీపీ అంజలి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి ఎంఈఓ కృష్ణమోహన్, యూటీఎఫ్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో నిఘా ఉంచండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

కొత్తచెరువు: అంతర్ రాష్ట్ర సరిహద్దులో ప్రత్యేక నిఘా ఉంచి అక్రమ రవాణాను అరికట్టాలని ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన ఎస్పీ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మట్కా, గుట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యే నిఘా ఉంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న యుఐ గ్రేవ్ కేసులు, ఫ్యాక్షన్ కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు. కేసుల ఛేదింపునకు దిశానిర్దేశం చేశారు. నిందితుల అరెస్ట్ సమయంలో నిబంధనలు పాటించాలన్నారు. పోలీసులపై ప్రజలకు నమ్మకం కలిగేలా సిబ్బంది పనితీరు ఉండాలన్నారు. కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దులోని చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ కేవీ రామకృష్ణప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి, డీఎస్పీలు యశ్వంత్, భవ్యకిశోర్, హుసేన్‌పీరా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల ఛేదింపు పెరగాలి

కొత్తచెరువు: ప్రజలు గ్రామాలలో నాటుసారా జోలికి వెళ్ళకుండా ప్రజల్లో అవగాహన తీసుకురావాలని సెబ్ అడిషనల్ ఎస్పీ కె.వి.రామకృష్ణ ప్రసాద్ సూచించారు. ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాలతో శుక్రవారం సెబ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుంచి లిక్కర్, ఏపీ లిక్కర్, నాటుసారా, ఇసుక, స్టేషన్ల వారీగా కేసులపై ఆరా తీశారు. ఎన్‌డీపీఎల్, డీపీఎల్ కేసుల్లో నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల ఛేదింపు పెరగాలని, అక్రమ లిక్కర్‌పై సరిహద్దుల్లో గట్టి నిఘా ఉంచి అరికట్టాలని ఆదేశించారు. తరచూ నేరాలకు పాల్పడే వారిపై ఇదివరకే రౌడీషీట్లు తెరవడం జరిగిందని, అలాంటి వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిఘా పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, సెబ్ అధికారులు, సీఐలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీలు

తాడిమర్రి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితమ్మ గర్భిణులు, బాలింతలకు సూచించారు. శుక్రవారం స్థానిక నాల్గవ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు చేపలు, మాంసం, గుడ్లు తదితర పోషక విలువలు కలిగిన ఆహారాన్ని రోజూ తీసుకోవాలన్నారు. సరైన ఆహారం తీసుకుంటే నిరోధక శక్తి పెరిగి ఎటువంటి రోగాలు దరిచేరవన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్త భారతితో కలిసి చిన్నారుల ఎత్తు, బరువు తూకాలను పరిశీలించారు.

తలుపుల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణ పక్వాడా వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో శిశు సంక్షేమ పర్యవేక్షకులు దీప, అంగన్‌వాడీ కార్యకర్తలు పుణ్యవతి, లక్ష్మీదేవి, వెంకటేశ్వరమ్మ, సుజాత, స్వరూపా రాణి పాల్గొన్నారు.

నేడు పంచాయతీ రూముల వేలం

చెన్నేకొత్తపల్లి: స్థానిక పంచాయతీ రూముల వేలం పాట శనివారం ఉదయం 11 గంటలకు ఉంటుందని ఎంపీడీఓ అశోక్‌నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల కేంద్రంలోని సంత మార్కెట్ వద్ద పంచాయతీ నిధులతో నిర్మించిన 16 రూములను వేలం వేయనున్నట్లు తెలిపారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

నల్లమాడ: పీఎం కిసాన్ పథకానికి సంబంధించి రైతులతో ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించాలని కదిరి వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన వ్యవసాయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. యంత్ర పరికరాల మంజూరుకు వీలుగా రైతు సంఘాలతో ఈ నెలాఖరు లోపు రైతు వాటా డబ్బులు కట్టించి ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల నిల్వలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుమతి పాల్గొన్నారు.

రామగిరి ఎంఈఓగా గోపాల్

రామగిరి: మండల విద్యాధికారిగా గోపాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంఈఓగా కంబదూరుకు చెందిన సాయికృష్ణ విధులు నిర్వర్తించేవారు. రొళ్ల మండలం ఎంఈఓగా ఉన్న గోపాల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన మాట్లాడుతూ పది పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాజశేఖర్, కంప్యూటర్ ఆపరేటర్ ఆజాద్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న పుల్లన్న

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన పుల్లన్న శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంలో వెళుతూ ఎరగుంట క్రాస్ వద్ద ఆగివున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో పుల్లన్న తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిర్ కూలర్ వితరణ

తాడిమర్రి: స్థానిక మసీదులోని ముస్లింల కోసం అనంతపురానికి చెందిన అబ్దుల్ హుస్సేన్ రూ.20 వేలు విలువ చేసే ఎయిర్ కూలర్‌ను శుక్రవారం అందజేశారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఉండే ముస్లింల సౌకర్యార్థం ఎయిర్ కూలర్‌ను అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ముతవల్లి ఇస్మాయిల్, సెక్రటరీ మహబూబ్ బాషా, శివంపల్లి మహబూబ్, నదురుల్లా షబ్బీర్, బడేసాహేబ్ పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రశాంతి నిలయం: శ్రీ సత్యసాయి జిల్లాలోని కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి, ఇంటర్, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లకు ఈనెల 27 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ మీనాక్షి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనాథలు, బడి బయటి పిల్లలు, డ్రాపౌట్స్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వలస కుటుంబాలకు చెందిన పేదరిక రేఖకు దిగువన ఉన్న బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. మరిన్ని వివరాల కోసం http:apkgbv.apcfss.in వెబ్‌సైట్ చూడాలన్నారు.